16-02-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - సంగమయుగంలో తండ్రి వచ్చారు పిల్లలైన మీకు ప్రాణప్రదంగా సేవ చేయడానికి, ఇప్పుడు ఈ డ్రామా పూర్తి అవుతుంది. మీరందరూ తిరిగి ఇంటికి వెళ్ళాలి"**

ప్రశ్న:- ఇప్పుడు పిల్లలైన మీకు కర్మాతీత అవస్థ ఏర్పడదు, అంతిమంలో ఏర్పడుతుంది - ఎందుకు?

జవాబు:- ఎందుకంటే ఆత్మలైన మీరు ఎప్పుడైతే కర్మాతీతంగా అవుతారో, అప్పుడు మీకు పావన తత్వాలతో తయారైన శరీరం కావాలి. ఇప్పుడైతే ఈ 5 తత్వాలు పతితంగా ఉన్నాయి. ఎప్పుడైతే తత్వాలు పావనంగా అవుతాయో, అప్పుడు కర్మాతీత అవస్థ ఏర్పడుతుంది. పిల్లలైన మీరు ఎప్పుడైతే పూర్తిగా పావనంగా అయిపోతారో, అప్పుడు ఇక్కడ ఉండలేరు కూడా. పావనంగా అయినట్లయితే, పావన ప్రపంచంలో పావన శరీరం కావాలి. కనుక ఇప్పుడు మీరు హాఫ్ కాస్ట్ గా (అసంపూర్ణంగా) ఉన్నారు. అంతిమంలో మీ బుద్ధి యోగము పూర్తిగా కుదురుతుంది, మీరు పావనంగా అయిపోతారు. మీ వికర్మలన్నీ వినాశనమైపోతాయి మరియు మీ కర్మాతీత అవస్థ ఏర్పడుతుంది.

గీతము:- దూరదేశంలో నివసించేవారు, పరాయి దేశములోకి వచ్చారు... (దూరదేశ్ మే రహ్నే వాలా...)

ఓంశాంతి. దూరదేశంలో ఉండే ఆ యాత్రికుడిని మనుష్యమాత్రులు లేక జీవాత్మలందరూ తప్పకుండా స్మృతి చేస్తారు. వాస్తవానికి జీవాత్మలందరూ యాత్రికులే. ఎలాగైతే తండ్రికి పరంధామం నుండి రావలసి ఉంటుందో, అలాగే పిల్లలైన మీరు కూడా ఈ పాత్రను అభినయించడానికి పరంధామం నుండి వస్తారు. నాకైతే పూర్తి కల్పంలో ఒక్కసారి రావలసి ఉంటుంది. ఈ కారణంగా నన్ను - రీ ఇన్కార్నేషన్ (పునః అవతరించినవారు) అని అంటారు. మీరు ఒకసారి ఇక్కడకు వస్తారు, ఇక ఇక్కడే పునర్జన్మలు తీసుకుంటూ ఉంటారు. నేను ఒకేసారి పిల్లల వద్దకు ప్రాణప్రదంగా, ఎంతో ప్రేమగా సేవ చేయడానికి వస్తాను. తండ్రికైతే పిల్లలందరూ ప్రియమైనవారు కదా. పిల్లలంటే ప్రేమ లేనటువంటి తండ్రి ఎవరూ ఉండరు. పిల్లలకే తండ్రి నుండి వారసత్వం లభిస్తుంది. వారు హద్దు తండ్రి, వీరు అనంతమైన తండ్రి. తండ్రి ఎప్పుడు వస్తారు అనేది ఎవరికీ తెలియదు. తండ్రి అంటారు - మధురమైన పిల్లలూ, ఇప్పుడు డ్రామా పూర్తి అవుతుంది, తిరిగి వెళ్ళాలి. మార్గం ఎవరికీ తెలియనే తెలియదు. వైకుంఠవాసులు అయ్యారు, నిర్వాణం చెందారు అని కేవలం నామ మాత్రంగా అంటారు. మధ్యలో ఎవరూ తిరిగి వెళ్ళలేరని ఇప్పుడు మీకు తెలుసు. ఎప్పుడైతే అందరి పాత్ర పూర్తి అవుతుందో, అప్పుడు తండ్రికి రావలసి ఉంటుంది. ఆత్మలమైన మనమందరము శరీరంలో ఉన్నప్పుడు, శరీరం పరంగా సోదరీ-సోదరులము అవుతామని మీకు తెలుసు. ప్రతి ఒక్కరు తమ-తమ పాత్రను పూర్తి చేయాలి. మళ్ళీ అందరూ తమ-తమ సమయానికి పాత్రను రిపీట్ చేయాల్సి ఉంటుంది. ఓ పతిత-పావనా రండి, ఓ సీతా-రామా రండి అని తండ్రిని అందరూ స్మృతి చేస్తారు. ఒక రాముడు, ఒక సీత కోసం మాత్రమే ఏమైనా వస్తారా. సీతలందరికీ రాముడు ఒక్కడే. పిల్లలందరూ స్మృతి చేస్తారు, భక్తి చేస్తారు. ఈ డ్రామా 5 వేల సంవత్సరాలది. తండ్రి అంటారు - మీకు మీ జన్మల గురించి తెలియదు, నాకు తెలుసు. లక్షల సంవత్సరాల విషయాన్ని అయితే ఎవరూ చెప్పలేరు. ముఖ్యమైన మొదటి విషయం ఏమిటంటే గీతా భగవంతుడు ఎవరు. డ్రామానుసారంగా మర్చిపోయారు, అందుకే తండ్రి వచ్చారు. కేవలం గీతను చదవడం ద్వారా ఏమీ జరగదు. తండ్రి స్వయమే వచ్చి పిల్లలకు రాజయోగాన్ని నేర్పిస్తారు. తండ్రి అంటారు, ఈ కొత్త-కొత్త విషయాలు ఏవైతే మీకు వినిపిస్తానో, ఇవన్నీ ప్రాయః లోపమైపోతాయి. ఇవి పరంపరగా కొనసాగవు. మిగిలినవారు ఎవరైతే వస్తారో, వారి జ్ఞానం అంతిమం వరకు నడుస్తుంది. ఒకరికొకరు వినిపిస్తూ వస్తారు. ఇక్కడ వినేవారూ ఉండరు, వినిపించేవారూ ఉండరు. అందరూ వెళ్ళిపోతారు. అక్కడ, మేము 16 కళల సంపూర్ణులము అని కూడా తెలియదు. అది ఉన్నదే ప్రారబ్ధము. 16 కళల నుండి 14 కళల వారిగా అవుతాము - ఇది తెలిస్తే రాజ్యాధికారం యొక్క సంతోషమే పోతుంది. తండ్రి అర్థం చేయిస్తారు - ఉన్నతోన్నతమైన ధర్మ శాస్త్రం ముందు ఉండాలి. దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేసేవారిని మర్చిపోయారు. గీతకు ఎంత మహిమ అయితే ఉందో, అంతకన్నా ఎక్కువ జ్ఞానం వినిపించేవారికి ఉంది. ఇతర ఏ ధర్మాలను స్థాపన చేసేవారిని భగవంతుడు అని అనరు. భగవంతుడైతే ఒక్క నిరాకారుడే. మిగిలిన వారంతా సాకారులు. శ్రీమత్ భగవద్గీత అని కూడా అంటూ ఉంటారు. వారు అందరి సద్గతిదాత. ఈ సమయంలో అందరూ తమోప్రధానంగా, నిర్జీవంగా ఉన్నారు. తర్వాత బాబా వచ్చి అందరినీ మేల్కొల్పుతారు. ఈ పాత ప్రపంచమైతే సమాప్తం అవ్వనున్నది. ఆవగింజల వలె అందరూ నలిగిపోతారు. సత్యయుగంలో చాలా చిన్న దైవీ వృక్షం ఉంటుంది. ఓ భగవంతుడా, ఓ సత్య ఖండాన్ని స్థాపన చేసేవారా... అని అందరూ భగవంతుడిని

తలుచుకుంటారు కానీ వారెప్పుడు వస్తారు. శాస్త్రాలలోనైతే లక్షల సంవత్సరాలు అని రాసేస్తారు. దీనినే అంధకారం అని అంటారు. మా బాబా జ్ఞానసాగరుడని ఇప్పుడు మీకు తెలుసు. ఇతరులెవ్వరూ జ్ఞానసాగరునిగా అవ్వలేరు. జ్ఞానసాగరుడైన తండ్రి దూరదేశం నుండి పిల్లలైన మన వద్దకు వస్తారు. మనమందరము అంధకారంలో పడి ఉండేవారము. డ్రామాలో మేమందరము పాత్రధారులము అని ఇంతకుముందు తెలియదు. ఉన్నతోన్నతమైన వారు ఎవరు అనేది తెలిసి ఉండాలి. కేవలం సర్వవ్యాపి అని అంటే, అది జ్ఞానమైనట్లా! ఒకవేళ సర్వవ్యాపి అయినట్లయితే, ఇక భక్తి కూడా చేయలేరు. దీనిని అజ్ఞానము అని అంటారు. సర్వుల సద్గతిదాత తండ్రి అని ఇప్పుడు మీకు తెలుసు. వారి పేరే పరమపిత పరమాత్మ శివ. వారు తండ్రులకు కూడా తండ్రి. జన్మ-జన్మాంతరాలుగా లౌకిక తండ్రులు లభిస్తూ వచ్చారు.

ఉన్నతోన్నతమైన వారు తండ్రి, తర్వాత నంబరువారుగా వస్తారు. మొట్టమొదట దేవీ-దేవతా వంశావళివారు దిగుతారు. ఇప్పుడు ఆ రచనను తండ్రి రచిస్తున్నారు. బ్రహ్మ ద్వారా బ్రాహ్మణులను ఎలా రచిస్తారు? ప్రజాపిత బ్రహ్మ ద్వారా దత్తత తీసుకుంటారు. పిల్లలంటారు, బాబా, మేము మీ వారిగానే ఉండేవారము, ఇప్పుడూ మీ వారిమే. మొట్టమొదట మనం సత్యయుగంలో వచ్చాము.

ఈ సమయంలో మీరు హాఫ్ కాస్ట్ గా (అసంపూర్ణంగా) ఉన్నారు. శూద్రుల నుండి బ్రాహ్మణులుగా అవుతున్నారు. పూర్తి పవిత్రంగా, కర్మాతీతంగా చివర్లో అవుతారు. చివర్లో బుద్ధి యోగము పూర్తిగా కుదురుతుంది మరియు వికర్మలన్నీ భస్మమైపోతాయి. అయినా కూడా, ఇక్కడ మిమ్మల్ని పావనులు అని అనరు ఎందుకంటే శరీరం పతితంగా ఉంది. ఇప్పుడు పతితం నుండి పావనంగా అవుతున్నారు మళ్ళీ సత్యయుగంలో శరీరం కూడా పావనమైనది లభిస్తుంది. పూర్తిగా పావనంగా అయిపోతారు. ఆ తర్వాత ఇక్కడ ఉండలేరు. ఎప్పుడైతే ఆత్మ పవిత్రంగా అయిపోతుందో, అప్పుడిక 5 తత్వాలు కూడా పవిత్రంగా అయిపోతాయి. ఇప్పుడు పిల్లలైన మీరు సంగమంలో ఉన్నారు. సత్యాతి-సత్యమైన కుంభమేళా ఇదే. నీటి గంగ వద్దకు వెళ్ళడము - ఇది భక్తి మార్గము. సన్యాసులు స్నానాలు చేయడానికి వెళ్తారు, అయినా కూడా ఆత్మ నిర్లేపి అని అనేస్తారు. తండ్రి అంటారు, భక్తి మార్గంలో మీరు చాలా విన్నారు, ఇప్పుడు రైట్ ఏమిటో నిర్ణయించుకోండి. ఇది అమరకథ, దీని ద్వారా మీరు అమరపురికి యజమానులుగా అయిపోతారు, మిమ్మల్ని ఎప్పుడూ కాలుడు కబళించలేడు. ఫలానావారు మరణించారు అని అక్కడ ఎప్పుడూ అనరు. ఇక్కడ మృత్యువు భయం ఎంతగా ఉంటుంది. అక్కడైతే కేవలం వస్త్రాన్ని మారుస్తారు. భారత్ మహిమ చాలా భారీ అయినది. తండ్రికి ఎంత మహిమ ఉందో, భారత్ కు కూడా అంత మహిమ ఉంది. భారత్ లో లక్ష్మీ-నారాయణుల మందిరాలు ఇప్పటికీ కూడా తయారవుతూ ఉంటాయి. కానీ తండ్రి ఎప్పుడు వచ్చారు అనేది తెలియదు. తప్పకుండా సత్యయుగంలో దేవీ-దేవతలు ఉండేవారు. సత్యయుగానికి లక్షల సంవత్సరాలు చూపించినప్పుడు, మరి వారి సంఖ్య కూడా లెక్కలేనంతగా ఉండాలి. ఎవరూ బుద్ధి ద్వారా పని చేయరు. గోముఖం నుండి గంగ వెలువడింది అని అంటారు. అదంతా జ్ఞానం యొక్క విషయము. మళ్ళీ సూక్ష్మవతనంలో ఎద్దు మొదలైనవి ఎక్కడ నుండి వచ్చాయి. ఈ శాస్త్రాలు అర్ధకల్పం నుండి కొనసాగుతూనే వచ్చాయి. ఈ విషయాలన్నింటినీ అతి ప్రియమైన తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తారు. నిజానికి అందరూ నా పిల్లలే. కానీ మీరు అతి ప్రియమైనవారిగా అవుతారు. లక్ష్మీ-నారాయణులు ఎప్పుడు రాజ్యం చేసి వెళ్ళారో తెలియదు. రాధే-కృష్ణుల జన్మదినాన్ని జరుపుతారు. లక్ష్మీ-నారాయణుల గురించి ఏమీ తెలియదు. రాముడిని త్రేతాలో చూపిస్తారు. కృష్ణుడిని ద్వాపరంలో. రాధే-కృష్ణులు సత్యయుగానికి చెందినవారు. అన్ని ధర్మాలు ఎలా రిపీట్ అవుతాయి, ఫలానా ధర్మ స్థాపకుడు ఎప్పుడు వస్తారు, ఇవన్నీ మీకే తెలుసు. ధర్మ స్థాపన చేసి తిరిగి వెళ్ళిపోతారు అని వారు అనుకుంటారు. అరే, అప్పుడు మరి పాలన ఎవరు చేస్తారు! మనుష్యులు ప్రతి ఒక్కరూ రచనను రచిస్తారు, ఆ తర్వాత పాలన కూడా చేస్తారు, వినాశం చేయరు. హద్దు రచనను చేసే తండ్రి అల్పకాలికమైన క్షణ భంగుర సుఖాన్ని ఇవ్వగలరు. ఎవరికైనా కొడుకు లేకపోతే, మా కులం ఎలా వృద్ధి చెందుతుంది అని అంటారు. తండ్రి అంటారు, ఈ సమయంలో అందరూ పతితులుగా, భ్రష్టాచారులుగా ఉన్నారు. భారత్ పరిస్థితి ఎలా అయిపోయింది - అని ఒక పాట ఉంది. మళ్ళీ ఇంకొక పాటలో, మా భారత్ అన్నింటికన్నా ఉన్నతమైనది అని ఉంది. ఇప్పుడు ఉన్నతంగా ఉందా? లేదు. ఇప్పుడైతే పూర్తిగా పతితంగా ఉంది. తండ్రి అంటారు, పిల్లలూ, ఓర్పు వహించండి, ఇది కూడా ఆట. ఇప్పుడు దుఃఖపు రోజులు పూర్తి అయి సుఖపు రోజులు వస్తున్నాయి. ఈ నరకాన్ని స్వర్గంగా చేయడానికి పరంధామంలో నివసించే తండ్రి పరాయి దేశంలో వచ్చారు. తండ్రి అంటారు, ఇది నా జన్మ స్థలము. లేదంటే నిరాకార బాబా ఎక్కడకు వచ్చారు? ఏ శరీరంలోకి వచ్చారు? ఎప్పుడు వచ్చారు? ఏం చేయడానికి వచ్చారు? అన్నది ఎవరూ తెలియజేయలేరు. పరమపిత పరమాత్మ వచ్చి పతితులను పావనంగా ఎలా తయారుచేస్తారు అనేది పిల్లలైన మీకు తెలుసు. తండ్రి

అంటారు, పిల్లలూ, నా వద్ద ఇంకే చికిత్స లేదు. ప్రియమైన పిల్లలూ, మీరు నన్నే పతిత-పావనుడు అని అంటారు, సర్వశక్తివంతుడు అని అంటారు. ఇప్పుడు 5 వికారాలపై విజయం పొందడానికి మీకు శక్తి కావాలి. ఇక్కడ హింసాత్మక యుద్ధం యొక్క విషయం లేదు. ఇది గుప్తమైనది. కేవలం నన్ను స్మృతి చేయండి. దీనినే అజపాజపము (నిరంతర జపము) అని అంటారు. ఇప్పుడు అందరిది వానప్రస్థ అవస్థ, అందరూ తిరిగి వెళ్ళాలి. అది శాంతిధామము. అక్కడ నుండి మళ్ళీ స్వతహాగానే మీరు సుఖధామంలోకి వచ్చేస్తారు. శాంతి అయితే మీ స్వధర్మము. నిజానికి ఈ రావణ రాజ్యంలో శాంతి లభించజాలదు. ఇకపోతే, కొద్ది సమయానికి కావాలనుకుంటే అశరీరిగా అయి కూర్చుండిపోండి. శాంతి అయితే అందరికీ కావాలి. ఒకవేళ 101 కోట్లమంది శాంతిలో కూర్చున్నా సరే, శాంతి ఏర్పడజాలదు. ఇది ఉన్నదే అశాంతి ప్రపంచము. శాంతి కోసం ఎలాంటి ఉపాయమూ వెలువడజాలదు. ఇదైతే గాడ్ ఫాదర్ యొక్క బాధ్యతనే. దేవీ-దేవతల రాజ్యం ఉండేది, దానిని వైకుంఠమని అంటారని మీకు తెలుసు. ఇప్పుడిది కలియుగ అంతిమము, దుఃఖధామము. అది శాంతిధామము, మధురమైన ఇల్లు. మధురమైన తండ్రి కూడా అక్కడే ఉంటారు. అది సుఖధామము, ఇది దుఃఖధామము. మధ్యలో వేరే-వేరే ధర్మాలు వెలువడుతాయి. వృద్ధి అవుతూ ఉంటుంది. వారైతే కల్పం యొక్క ఆయువును లక్షల సంవత్సరాలు అని అనేసారు. దీనిని ఘోర అంధకారము అని అంటారు. సత్యయుగము అత్యంత ప్రకాశము. మూలవతనంలో అపారమైన శాంతి ఉంటుంది. మనం ఇక్కడకు పాత్రను అభినయించడానికి వచ్చాము.

తండ్రి అంటారు, ఓ ఆత్మలూ, తమ చెవులు రూపీ ఇంద్రియాల ద్వారా వింటున్నారా? ఈ డ్రామా చక్రం ఎలా తిరుగుతుందో మీకు గుర్తుందా. మీరు ఈ సమయంలో త్రికాలదర్శులు. బ్రాహ్మణులైన మీరు తప్ప ఇంకెవ్వరూ త్రికాలదర్శులు కారు. మాకు ఈశ్వరుడి గురించి తెలియదు, మేము నాస్తికులము అని ఋషులు, మునులు అనేవారు. ఇప్పుడు మీరు ఆస్తికులుగా అయ్యారు. తండ్రి మరియు సృష్టి చక్రం యొక్క ఆది మధ్యాంతాల గురించి తెలుసు. మీకు మూడు లోకాల జ్ఞానం లభించింది. కేవలం మీకు తప్ప ఇంకెవ్వరికీ ఈ జ్ఞానం లేదు. లక్ష్మీ-నారాయణులను త్రిలోకనాథులు అని గానీ, త్రికాలదర్శులు అని గానీ అనరు. మనుష్యులు త్రిలోకనాథులుగా అవ్వలేరు. మీకు మూడు లోకాలు మరియు మూడు కాలాల గురించి తెలుసు. లక్ష్మీ-నారాయణులకు కూడా మూడు లోకాల జ్ఞానం లేదు. విష్ణువును స్వదర్శన చక్రధారిగా చూపిస్తారు. ఇప్పుడు విష్ణువు యొక్క రెండు రూపాలు లక్ష్మీ-నారాయణులు. రాధే-కృష్ణులే లక్ష్మీ-నారాయణులుగా అవుతారు. ఈ సమయంలో ఎంత మంచి స్మృతి చిహ్నా మందిరాలు తయారుచేసారు. కానీ వీరి చరిత్ర గురించి అయితే తెలుసుకోవాలి. ఉన్నతోన్నతమైన భగవంతుడు ఒక్కరే. వారి పేరు శివ. రుద్రుడు అని కూడా అంటారు. ఇది రుద్ర జ్ఞాన యజ్ఞం, కృష్ణ జ్ఞాన యజ్ఞం ఉండనే ఉండదు. కృష్ణుడైతే సత్యయుగం యొక్క రాకుమారుడు. వారు యజ్ఞం ఏం రచిస్తారు. రుద్ర యజ్ఞం నుండి వినాశ జ్వాల ప్రజ్వలితమవుతుంది. సత్యయుగంలో యజ్ఞం రచించాల్సిన అవసరం లేదు. ఈ జ్ఞాన యజ్ఞం తప్ప మిగిలినవన్నీ స్థూలమైన యజ్ఞాలు. దీనిని యజ్ఞం అని ఎందుకు అంటారో తండ్రి అర్థం చేయించారు. ఈ పాత ప్రపంచపు సామగ్రి ఏదైతే ఉందో, అదంతా ఇందులో స్వాహా అవ్వనున్నది. కావుననే పరమపిత పరమాత్మ యజ్ఞం రచించారు, దాని ద్వారా మనుష్యులు దేవతలుగా అవుతారు అని అంటారు. దేవతలు పాత ప్రపంచంలో కాళ్ళు మోపరు. మీకైతే అన్నింటినీ సాక్షాత్కారం చేయించారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

**1.** తమ శాంత స్వధర్మంలో సదా ఉండాలి. ఇది వానప్రస్థ అవస్థ, తిరిగి ఇంటికి వెళ్ళాలి అందుకే తండ్రి స్మృతి అజపాజపముగా కొనసాగుతూ ఉండాలి.

2. కర్మాతీతంగా అయ్యేందుకు సంపూర్ణ పావనంగా అవ్వాలి. వికర్మల భారం ఏదైతే ఉందో, దానిని స్మృతి యాత్రలో ఉంటూ తొలగించివేయాలి. స్మృతి శక్తితో వికారాలపై విజయం పొందాలి.

వరదానము:- శుద్ధ సంకల్పాల ముట్టడి ద్వారా సదా ఛత్రఛాయను అనుభూతి చేసే, చేయించే దృఢ సంకల్పధారీ భవ

మీ ఒక్క శుద్ధ సంకల్పం లేక శ్రేష్ఠ శక్తిశాలి సంకల్పం చాలా అద్భుతం చేయగలదు. శుద్ధ సంకల్పాల బంధనము లేక ముట్టడి బలహీన ఆత్మల కొరకు ఛత్ర ఛాయగా అయి, రక్షణ సాధనంగా లేక కోటగా

తయారవుతుంది. కేవలం ఈ అభ్యాసంలో మొదట యుద్ధం నడుస్తుంది, వ్యర్థ సంకల్పాలు శుద్ధ సంకల్పాలను తెంచేస్తాయి. కానీ ఒకవేళ దృఢ సంకల్పం చేసినట్లయితే, మీ సహచరుడు స్వయంగా తండ్రి, విజయ తిలకం సదా ఉండనే ఉంది. కేవలం దీనిని ఇమర్జ్ చేసినట్లయితే, వ్యర్థం స్వతహాగానే మర్జ్ అయిపోతుంది.

స్లోగన్:- ఫరిశ్తా స్వరూపాన్ని సాక్షాత్కారం చేయించేందుకు శరీరం నుండి వేరుగా ఉండే అభ్యాసం చేయండి.